

పేదవాడి కడుపు నింపడమే లక్ష్యంగా పనిచేయాలి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం : రేషన్ డీలర్లను ప్రభుత్వంలో భాగస్వామ్యం చేసి బాధ్యతలను అప్పగించామని తద్వారా రీసైక్లింగ్ లేకుండా పిడిఎస్ బియ్యం నేరుగా పేదవాడి కడుపు నింపగలదని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్ఎను నియోజకవర్గ రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రభుత్వంలో భాగస్వాములని, ప్రతినెల ఒకటవ తేదీ నుంచి 15వ తేదీ వరకు రేషన్ షాపుల వద్ద సరుకులు తీసుకునే అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలు ఎక్కడనుంచైనా రేషన్ బియ్యం తీసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, డీలర్లు ప్రజలకు బియ్యం సక్రమమైన మార్గంలో అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన కోరారు. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల రేషన్ షాప్ డీలర్ల అధ్యక్ష కార్యదర్శులు నాగార్జున, పరిమి రామవతారం, తాతాజీ పాల్గొన్నారు.

కౌలు రైతులను పక్కన పెట్టి..
భూ యజమానులకు పట్టం కట్టి..!



'అన్నదాత సుఖీభవ' అర్హుల జాబితా వెరిఫికేషన్ దాదాపు పూర్తి
రెండు జిల్లాల్లో రెండు లక్షల మంది వరకూ అర్హులుగాతేలే అవకాశం
వెబ్‌ల్యాండ్ ఆధారంగా జాబితా తయారు..
కౌలురైతులను పూర్తిగా పక్కకు పెట్టేసిన పరిస్థితి
సాగుకు దూరంగా ఉన్న భూ యజమానులకే అన్నదాత సుఖీభవ సొమ్ములు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రైతులకు పెట్టుబడి సాయం కింద అందించే 'అన్నదాత సుఖీభవ' పథకంలో కౌలు రైతులను పూర్తిగా పక్కకు పెట్టేసి, భూ యజమానులకు సాయం అందించే విధంగా ప్రభుత్వం జాబితా సిద్ధం చేస్తోంది. దీంతో వాస్తవ సాగుదారుడైన కౌలు రైతుకు తీరని అన్యాయం జరిగే పరిస్థితి ఏర్పడింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో మూడు లక్షల మంది కౌలు రైతులకు అన్యాయం జరిగే పరిస్థితి నెలకొంది. ఖరీఫ్ ఆరంభం నాటికి అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం జమచేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ సొమ్ములు జమ చేసేటప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సొమ్ములు జమ చేస్తామని చెప్పింది. కేంద్ర ప్రభుత్వం పిఎం కిసాన్ కింద రూ.రెండు వేలు చొప్పున మూడు విడతలుగా సొమ్ములు జమ చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.20 వేలులో కేంద్రం ఇచ్చే రూ.ఆరు వేలు పోను.. మిగిలిన రూ.14 వేలు పిఎం కిసాన్‌తోపాటు మూడు విడతలుగా జమ చేయనున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. మరో రెండు వారాల్లో ఖరీఫ్ సాగు ప్రారంభం కానుంది. దీంతో అన్నదాత సుఖీభవ జాబితాను సిద్ధంచేసే పనిలో వ్యవసాయశాఖ అధికారులు ముమ్మరంగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 20వ తేదీకే జిల్లాల నుంచి జాబితా సిద్ధం చేసి పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. రబీ ధాన్యం కొనుగోలు పూర్తికాకపోవడంతో జాబితా ఆలస్యమైంది. దీంతో గడువు పెంచారు. ఈ నెల 27వ తేదీ నాటికి జాబితా పంపించాల్సి ఉంది. ఇప్పటికే అన్నదాత సుఖీభవ జాబితాకు సంబంధించి వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపు పూర్తయ్యే దశకు చేరుకుంది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా అర్హులను ఎంపిక చేస్తున్నారు. వెబ్‌ల్యాండ్ భూ యజమానుల పేర్లు తప్ప కౌలురైతుల పేర్లు ఒక్కటి కూడా లేని పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో వెబ్‌ల్యాండ్ జాబితాలో మొత్తం 4,02,879 మంది భూ యజమానుల పేర్లు ఉన్నాయి. ఆక్వా చెరువులు, ల్యాండ్ కన్వర్షన్, ప్రభుత్వ ఉద్యోగులు, వంటి వారి పేర్లను తొలగించి జాబితా తయారు చేస్తున్నారు. ముందుగా గ్రామంలోని వ్యవసాయాధికారి వెరిఫికేషన్ చేసి ఆ జాబితాను మండల వ్యవసాయశాఖ అధికారికి పంపించారు. అక్కడ వెరిఫికేషన్ జరిగిన తర్వాత సర్వే నెంబర్లపై సమస్యలున్న వాటిని తహశీల్దార్‌కు పంపిస్తున్నారు. తర్వాత జిల్లా స్థాయిలో, ఆ తర్వాత ఆర్‌టిజిఎస్ (రియల్‌టైం గవర్నెనెసెస్) వెరిఫికేషన్ జరిగి తుదిజాబితా తయారు కానుంది. ఏలూరు జిల్లాలో ఇప్పటి వరకూ మండలస్థాయి వెరిఫికేషన్ పూర్తయ్యే సరికి లక్షా 82 వేల మంది వరకూ జాబితాలో ఉన్నారు. ఇంకా వెరిఫికేషన్ జరుగుతోంది. అది కూడా పూర్తయ్యే సరికి లక్షా 20 వేల మంది పేర్లు తుది జాబితాలో ఉంటే అవకాశం ఉందని తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాలో 2.99 లక్షల మంది వెబ్‌ల్యాండ్ జాబితాలో ఉండగా ఇప్పటివరకూ వెరిఫికేషన్‌లో లక్షా 59 వేల మంది మిగిలారు. పూర్తి వెరిఫికేషన్ పూర్తయ్యే సరికి 90 వేల మంది పేర్లు జాబితాలో ఉండే అవకాశం ఉండనున్నట్లు అంచనా వేస్తున్నారు. పిఎం కిసాన్ జాబితా సంఖ్య ఉన్నట్లుగానే అన్నదాత సుఖీభవ జాబితా ఉండనుందని తెలుస్తోంది.

కౌలు రైతులు పూర్తిగా పక్కకు..

పెట్టుబడి సాయం అనేది సాగుచేసే రైతుకు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా సాగుకు దూరంగా ఉన్న భూ యజమానులకు ఇస్తోంది. వెబ్‌ల్యాండ్‌లో ఉన్న భూ యజమానుల పేర్లు ఆధారంగానే జాబితా తయారు చేస్తోంది. కౌలురైతుల జాబితా తయారీకి సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. దీంతో అధికారులు భూ యజమానుల పేర్లతోనే అన్నదాత సుఖీభవ జాబితాను సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు ఉన్నారు. జిల్లా వ్యవసాయ సాగులో 80 శాతం వరకూ కౌలురైతులే సాగుచేస్తున్నారు. వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతులకు అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందించకపోవడం అత్యంత దారుణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌలుకార్డుల జారీ ప్రక్రియ సైతం ఎప్పటికి పూర్తిచేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వం అందించే పిఎం కిసాన్ పథకంసైతం కౌలు రైతులకు అందకుండా చేశారు. ఇప్పుడు అన్నదాత సుఖీభవలోనూ కౌలురైతులకు చోటులేకుండా పోయింది. దీంతో కూటమి సర్కార్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మోడీ ప్రభుత్వ మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై.. ఐక్య పోరాటాలు చేపట్టాలి

పహల్గామ్ దాడిలో పాల్గొన్న ఎంత మంది ఉగ్రవాదులను పట్టుకున్నారో మోడీ చెప్పాలి : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
నరసాపురంలో ముగిసిన సిపిఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశం

ప్రజాశక్తి - నరసాపురం

దేశంలో మోడీ ప్రభుత్వం వేగవంతం చేస్తున్న మతోన్మాద కార్పొరేట్ విధానాలపై ఐక్య పోరాటాలు చేపట్టాలని, పహల్గామ్ దాడిలో ఎంత మంది ఉగ్రవాదులను పట్టుకున్నారో మోడీ దేశ ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా స్థాయి విస్తృత సమావేశం ఆదివారం అల్లూరి సత్యనారాయణ రాజు సాంస్కృతిక కేంద్రంలో జరిగింది. ఈ సమావేశానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కౌరు పెద్దిరాజు, ఆకివీడు ఏరియా నాయకులు డోకల లక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ తమ మతోన్మాద, కార్పొరేట్ విధానాలను శరవేగంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. దేశ సంపదను బడా కార్పొరేట్లకు దోచిపెట్టేలా విధానాలున్నాయన్నారు. అందుకు నిదర్శనమే విశాఖ ఉక్కు అమ్మకమని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 26 శాతం సుంకంపై ఎందుకు ధీటుగా స్పందించకుండా స్నేహ భావంగా ఉంటున్నారని, దేశ ప్రయోజనాలకంటే ట్రంప్‌తో స్నేహమే ముఖ్యమా అని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పహల్గామ్ దాడిలో ఉగ్రవాదుల్లో ఎంత మందిని పట్టుకున్నారని దేశ ప్రజలకు మోడీ చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియా, పాకిస్తాన్ యుద్ధం కోసం దేశ ప్రజలందరూ ఐక్యంగా రోడ్లపైకి వచ్చి పోరాడితే దేశ ప్రధాని మాత్రం ఎన్నికల ప్రచారానికి వెళ్లడం ఎలాంటి దేశ భక్తో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. మోడీ కార్పొరేట్ అనుకూల విధానాలు బట్టబయలు అవ్వడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ అమరావతి పున్ణశంకుస్థాపన జరిగినప్పుడు మోడీ రాష్ట్రానికి నిధులు, ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు రక్షణ వంటి అంశాలపై ప్రకటిస్తారని ఆశించిన రాష్ట్ర ప్రజలకు నిరుత్సాహమే ఎదురైందన్నారు. అమరావతి సభలో మోడీ భజన తప్ప రాష్ట్రాభివృద్ధి కోసం రాష్ట్ర కూటమి ప్రభుత్వ నేతలు మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. అన్ని విధాలా వెనుకబడుతున్న మన రాష్ట్రానికి కావాల్సింది మోడీ భజన కాదని, నిధులు, ప్రత్యేక హోదా కోసం ఎందుకు మాట్లాడని ప్రశ్నించారు. రాష్ట్రంలో యోగా డేకు ఇచ్చిన ప్రాధాన్యత స్టీల్ ప్లాంట్ రక్షణకై ఎందుకులేదని ప్రశ్నించారు. ఇంటింటా రేషన్ సరఫరా రద్దు అన్యాయమని, దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. యథావిధిగానే రేషన్ సరఫరా వాహనాల ద్వారానే చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలపై ప్రజా ఉద్యమాన్ని చేపట్టడానికి ఈ సమావేశంలో ప్రణాళికను చేపట్టామన్నారు. జిల్లాలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు వంటి అనేక సమస్యలపై ఇప్పటికే సిపిఎం పోరాడుతోందన్నారు. అభివృద్ధి పేరుతో పేదల ఇళ్లను కూల్చివేతను ఆపాలన్నారు. ఎవరి ఇళ్లు కూల్చేయాలన్నా ఉండి ఎంఎల్ఎ పేరు వాడుకొని స్థానిక నేతలు దౌర్జన్యాలు చేస్తున్నారని, దీనిపై ఉండి ఎంఎల్ఎ రఘురామ కృష్ణంరాజు స్పందించాలని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, పివి.ప్రతాప్, బి.వాసుదేవరావు, కర్రి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, ముచ్చర్ల త్రిమూర్తులు, మామిడిశెట్టి రామాంజనేయులు, గొర్ల రామకృష్ణ, ధనికొండ శ్రీనివాస్, సూర్నీడు వెంకటేశ్వరరావు, కె.క్రాంతిబాబు, కానేటి బాలరాజు, జిల్లా సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరామ్, నరసాపురం మండల కార్యదర్శి జల్లే రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా నిలిపివేత తగదు

తాళ్లకోడు ప్రభుత్వ కాలనీ వాసుల నిరసన

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు తాళ్లకోడు ప్రభుత్వ కాలనీలో నీటి సరఫరా నిలిపివేయడం తగదని పౌర సంఘం పట్టణ కన్వీనర్ బివి.వర్మ తెలిపారు. నీటి సరఫరాకు అంతరాయం విషయంలో విచారణ చేపట్టి వెంటనే ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక తాళ్లకోడు ప్రభుత్వ కాలనీకి మూడు రోజుల క్రితం కుప్పనపూడి నుండి వచ్చే తాగునీటి సరఫరాను ఆ గ్రామ అధికారులు నిలిపివేశారు. దీనిపై కాలనీవాసులతో వర్మ ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 20 సంవత్సరాలు ప్రజలు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితంగా ఈ కాలనీ స్థలం కొనుగోలు చేశారన్నారు. లబ్ధిదారులకు స్వాధీనపర్చడం కోసం మళ్లీ ఉద్యమాలు చేశామన్నారు. వెంటనే నాటి ప్రభుత్వం హడావుడీగా మున్సిపల్ ప్రాతిపదికన సెంటు చొప్పున ఇచ్చారన్నారు. ఇప్పటివరకూ కాలనీలో వెయ్యికి పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 1200 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపడుతుంటే మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ నెల 23న కాలనీని సందర్శించిన రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, జెసి రాహుల్‌కు కాలనీవాసులు తమ సమస్యలను మొరపెట్టుకున్నారని తెలిపారు. అది నచ్చని కొంతమంది నాయకులు అన్యాయంగా కాలనీకి వెళ్లే నీటి సరఫరాను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులకు, గృహ నిర్మాణ అధికారులకు విషయాన్ని తెలియపర్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. దీంతో తాగునీరు లేక స్థానికులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. తక్షణం జిల్లా అధికార యంత్రాంగం కాలనీని సందర్శించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కాలనీ వాసులతో నిరసన తెలిపారు. ఈ సమావేశంలో తాళ్లకోడు ప్రభుత్వ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పి.నాగు, పి.శ్రీనివాస్, బేగం, బి.లక్ష్మి, పి.అనసూయ, ఎం.రాజేశ్వరి, కె.రాజారత్నం, పి.నీలాద్రి, సంపతరావు, జాన్, ఆర్.వెంకన్న, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న తాళ్లకోడు కాలనీవాసులు


రోడ్డుపై నిలిచిన వర్షపునీరు

మొగల్తూరులో వర్షం

పిడుగుపాటుకు కొబ్బరిచెట్లు, ఇళ్లల్లోని విద్యుత్ ఉపకరణాలు ధ్వంసం

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం నార్త్‌లో ఆదివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అలాగే పిడుగు పడడంతో కొబ్బరిచెట్లు, పలు విద్యుత్ ఉపకరణాలు ధ్వంసం అయ్యాయి. దీంతో వేలాది రూపాయలు నష్టం వాటిల్లిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి మండలంలోని పేరుపాలెం సౌత్ పంచాయతీ పరిధి ఏటిమొండి ప్రాంతం నుంచి పేరుపాలెం వెళ్లే రహదారి చెరువును తలపించింది. దీంతో రహదారిపై ప్రయాణించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి రహదారి పునర్నిర్మాణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుపాలెం బీచ్‌లో యువకుడు గల్లంతు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఒక యువకుడు గల్లంతవ్వగా మరొక యువకుడుని మెరైన్ పోలీసులు, స్థానికులు రక్షించారు. దీనికి సంబంధించి స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం చిన్నాయగూడెంకి చెందిన ఏడుగురు యువకులు కలిసి పేరుపాలెం బీచ్‌కు వచ్చారు. ఈ క్రమంలో సముద్రపు అలల్లో స్నానం చేస్తూ ఉండగా దక్కపాటి దిలీప్, యాదవుల అజయ్(25) స్నానం చేస్తూ అలల ఉధృతికి లోపలకు కొట్టుకుపోయారు. వారిని కాపాడేందుకు అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిలోని మెరైన్ ఎస్ఐ సోమశేఖర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ పి.గణపతిరాజు శేఖర్, స్థానికుల సహాయంతో ప్రయత్నించారు. దిలీప్‌ని రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. అజయ్ అలల ఉధృతికి లోపలకు కొట్టుకు వెళ్లిపోయాడు. అజయ్ ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

నిఘా నేత్రంలో భీమవరం

రూ.36 లక్షలతో సీసీ కెమెరాలు
నిరంతరం పర్యవేక్షణ : మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మున్సిపాలిటీ అన్ని విధాల అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆదేశాల మేరకు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ రెడ్డి పర్యవేక్షణలో కమిషనర్ కె.రామచంద్రా రెడ్డి మున్సిపల్ సమస్యలపై ముందుకు వెళ్తున్నారు. ఇప్పటికే ప్లాస్టిక్ నియంత్రణ చేపట్టడంలో మున్సిపల్ అధికారులు సత్ఫలితాలు సాధించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజాశక్తితో మాట్లాడారు. భీమవరం జిల్లా కేంద్రం కావడంతో పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అభివృద్ధిలో భాగంగా మున్సిపల్‌లోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. రూ.36 లక్షలతో 64 సీసీ కెమెరాలు కాగా 32 రొటేట్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. సుమారు నెలరోజులకుపైగా బ్యాకప్ అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు. వీటి పర్యవేక్షణ కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయం, పోలీస్ కార్యాలయంలో ఉంటుందన్నారు. ఈవిధంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. ఎక్కడ ఏం జరుగుతుందో అటు ఉన్నతాధికారుల నిఘా ఉంటుందన్నారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం వల్ల పోలీసులకు ఎంతో ఉపయోగముందని తెలిపారు. నేడు ఎన్నో దొంగతనం కేసులు పరిష్కారం సీసీ ఫుటేజ్ ద్వారానే జరుగుతుందని, ఈ సీసీ కెమెరా వల్ల రాబోయే రోజుల్లో దొంగతనాలు కూడా పూర్తిస్థాయిలో మున్సిపాలిటీలో అరికట్టవచ్చని తెలిపారు. ఇప్పటివరకు 42 సీసీ కెమెరాలతో పాటు, 14 రొటేట్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మిగిలిన సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు తొందరలోనే పూర్తిచేస్తామని తెలిపారు. అయితే భీమవరం పట్టణం నిఘా నేత్రంలో ఉండటం నేటి రోజుల్లో ఎంతో ఉపయోగకరం. సీసీ కెమెరాలు ఏమేరకు సత్ఫలితాలు ఇస్తాయో చూద్దాం మరి.

అదనపు టీచర్ పోస్టుల నియామకాలు చేపట్టాలి

యుటిఎఫ్ మండల కార్యదర్శి ఆర్‌విఎస్.నారాయణ విక్రమ్


ప్రజాశక్తి - ఆకివీడు

అధికారిక లెక్కల ప్రకారం అదనంగా వచ్చిన 58 టీచర్ పోస్టుల నియామకం అమలు చేయాలని, లేనిపక్షంలో ఉపాధ్యాయ సంఘాలు సమన్వయంగా ప్రతిఘటిస్తామని యుటిఎఫ్ మండల కార్యదర్శి ఆర్‌విఎస్.నారాయణ విక్రమ్ హెచ్చరించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. తమ పోరాట ఫలితంగా 49 రోజులు దాటిన చోట రెండవ సెక్షన్ మంజూరు చేయటం వల్ల ఈ పోస్టులు వచ్చాయన్నారు. ఆ విధానాల్లో అదనంగా కొన్ని పోస్టులు వస్తాయని ఆ మొత్తం కలిపి 58 పోస్టులు అయ్యాయన్నారు. వచ్చిన ఆ పోస్టులు రాత్రికి రాత్రి పోస్టులు మంజూరు కాలేదని డిఇఒ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. డిఇఒ ఆఫీస్ వారు సదరు ఉపాధ్యాయులకు ఫోన్లు చేసి బలవంతంగా బదిలీ దరఖాస్తు పెట్టించడాన్ని యుటిఎఫ్ జిల్లా శాఖ తీవ్రంగా నిరసిస్తుందన్నారు. పోస్టులు వచ్చినట్టే వచ్చి రద్దు కావడం ఆశ్చర్యంగా ఉందంటూ ఆయన అభ్యంతరం తెలిపారు. విద్యాశాఖ వైఖరిని నిరసిస్తూ మంజూరైన పోస్టులు కొనసాగించాలని, ఉపాధ్యాయుల తప్పనిసరి బదిలీ అప్లికేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి జిల్లా డిఇఒ కార్యాలయం ఏలూరులో మెరుపు ఆందోళన చేయాలని నిర్ణయించామని ఆయన చెప్పారు.

రైతులకు అండగా ఉంటాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైతులకు సాగునీటికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని నవాబుపాలెంలో నవాబుపాలెం నుంచి ముత్యాలమ్మపురం వరకు ఒఅండ్ఎం ఆపరేషన్ గ్రాండ్ రూ.27.17 లక్షలతో చేపట్టిన ఏలూరు కాలువ ఆధునీకరణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కాలువలలో గాని, చెరువుల్లో గాని చెంచాడు మట్టి తీయకుండా రైతులకు సాగునీరు అందించడంలో వైఫల్యం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రైతులకు అవసరమైన అన్ని పనులు చేస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్, ఇరిగేషన్ ఎఇ సుధారాణి, జనసేన నాయకులు పైబోయిన రఘు, పాలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కాలువ ఆధునీకరణ పనులు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

చిన్నారిపై అత్యాచార నిందితులను శిక్షించాలి

దళిత సంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కడప జిల్లా మైలవరం గ్రామంలో నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని దళిత సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భీమవరం అంబేద్కర్ సెంటర్లో దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ ఫౌండర్ కోనా జోసెఫ్, దళిత నాయకులు గంటా సుందర్ కుమార్, కేసి రాజు మాట్లాడుతూ నాలుగేళ్ల చిన్నారిపై ఇటువంటి దాడులు జరగడాన్ని దళిత సంఘాలన్నీ ఖండిస్తున్నాయన్నారు. నిందితులను కఠినంగా శిక్షించడమే కాకుండా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా తిరుపతిలో దళిత యువకుడు జేమ్స్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈది రవికుమార్, టి.ప్రశాంత్, గతాల సందీప్, పిల్లి రవికాంత్, గెడ్డం జార్జ్, ఈది శేఖర్, ఆధార్ రాజు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న దళిత సంఘాల నేతలు

సాగరతీరం.. కోలాహలం

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తేనెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.


సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

మాస్టర్ ట్రెయినర్ల పాత్ర కీలకం : జెసి

ప్రజాశక్తి - భీమవరం

యోగాంధ్ర కార్యక్రమం విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్ల పాత్ర కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండవ రోజు నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ యోగ ఢిల్లీ ఆధ్వర్యంలో వర్చువల్ విధానంలో మాస్టర్ ట్రైనర్లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా యోగా మాస్టర్ ట్రైనర్లను ఉద్దేశించి జెసి టి.రాహుల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ యోగా శిక్షణా శిబిరంలో చక్కగా యోగా శిక్షణ తీసుకొని, మండలాల్లో యాభై మందికి శిక్షణ అందించాలని తెలిపారు. మండల స్థాయిలో శిక్షణ అందించేదుకు మాస్టర్ ట్రైనర్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడంలో మాస్టర్ ట్రైనర్లు బాధ్యత కీలకమని, మండలంలో శిక్షణ తీసుకున్న ట్రైనర్లు గ్రామాలలో కనీసం యాభైమందికి తక్కువ కాకుండా యోగా నేర్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ యోగాంధ్ర యాప్‌లో నమోదు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేసేవిధంగా అవగాహన, ప్రచారం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేసేవిధంగా ప్రోత్సహించాలని, యోగాతో ఆరోగ్యం వస్తుందని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, జిల్లా టూరిజం శాఖ అధికారి ఎ.అప్పారావు, డిఎస్‌డి ఒ.రాజేష్, జిల్లా ఆయుష్ శాఖ సిబ్బంది, మాస్టరు ట్రైనర్లు, యోగా సంస్థల అభ్యాసకులు పాల్గొన్నారు.


యోగా చేస్తున్న శిక్షకులు

28 నుంచి ట్రిపుల్ ఐటీ ధ్రువపత్రాల పరిశీలన

ప్రజాశక్తి – పెనుమంట్ర రూరల్

ట్రిపుల్ ఐటీ ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకున్న స్పెషల్ కేటగిరి విద్యార్థులకు ఈనెల 28 నుంచి 31 వరకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని రిజిస్ట్రార్ ఆచార్య సంఖ్య అమరేంద్రకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు క్రీడలు, సైనికోద్యోగుల పిల్లలు, ఎన్‌సిసి, భారత్ స్కౌట్స్, గైడ్స్ ధ్రువపత్రాలు ఉన్న విద్యార్థులకు రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామన్నారు. దరఖాస్తు సమయంలో ప్రత్యేక కేటగిరి కింద దరఖాస్తు చేయడం మరచిపోయిన విద్యార్థులకు కూడా నూజివీడులో జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యే అవకాశం కల్పించామని, ఈ అవకాశం వినియోగించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పిహెచ్‌సి అధికారిణి డాక్టర్ కనకప్రియ

ప్రజాశక్తి – పెనుమంట్ర

మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలను గుర్తెరిగి అందరూ వాటికి దూరంగా ఉండాలని పెనుమంట్ర పిహెచ్‌సి అధికారిణి డాక్టర్ కనకప్రియ కోరారు. కేర్ కమిటీ ఆధ్వర్యంలో పెనుమంట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల కలిగే స్వల్పకాలిక, దీర్ఘకాలిక అనారోగ్య ప్రభావాలపై కేర్ కమిటీ(కమిటీ ఫర్ ఆల్కహాల్ అవేర్‌నెస్ అండ్ రెస్పెక్ట్‌ఫుల్ ఎడ్యుకేషన్) అవగాహన కార్యక్రమం తణుకు ఎక్సైజ్ శాఖ ప్రజారోగ్యం కోసం నిర్వహించడం ముదావహమని అన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు సేవించడం వల్ల మానవ ఆరోగ్యంపై ముఖ్యంగా శరీరంలో వివిధ అవయవాలు గుండె, అన్నవాహిక, కాలేయం, పెద్ద ప్రేగులు, గుండె తదితర అవయవాలపై చూపే దుష్ప్రభావాలు చూపడం, మానసిక ఆందోళన, డిప్రెషన్, అధిక రక్తపోటు తదితర లక్షణాలు కలుగుతాయని ఆమె తెలిపారు. మత్తు పదార్థాలకు బానిస అయినవారికి అవసరమైన సహాయం అందిస్తూ బయటపడుటకు, పునరావాసం కల్పించుటకు అవసరమైన కౌన్సిలింగ్, పునరావాస కేంద్రాలు జిల్లాలో భీమవరంలో ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బందితో పాటు తణుకు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.మణికంఠ రెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.మధుబాబు, బి.లక్ష్మి, కానిస్టేబుల్ కె.నాగరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

అధిష్టానం తీరుకు నిరసనగా జనసైనికుల దీక్ష

ఆకివీడు : మండలంలోని జనసేన కార్యకర్తలు రచ్చకెక్కారు. అజ్జమూరులో ఆ పార్టీ కార్యకర్తలు పార్టీ అధిష్టానానికి నిరసనగా దీక్ష చేపట్టారు. గురువారం మధ్యాహ్నం ఆ గ్రామంలోనే దీక్షాశిబిరం ఏర్పాటు చేసుకుని నిరసన దీక్ష ప్రకటించారు. నియోజకవర్గ కన్వీనర్ తమతో ఏ విధంగానూ సంప్రదించకుండా తమ ప్రత్యేక వర్గాలను పార్టీలో చేర్చుకోవడం పట్ల వారు ఈ నిరసన చేపడుతున్నట్లు ప్రకటించారు. ఐదేళ్ల కాలం వరకు వైసిపిలో ఉన్న ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇటీవల గత వారంలో జనసేనలో చేరారు. అయితే ఇప్పటికే జనసేనలో సుమారు దశాబ్ద కాలంగా పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న పలువురు కార్యకర్తలు ఆ చేరికను ప్రతిఘటించారు. తాము ప్రతిపక్షంలో ఉన్న కాలంలో వైసిపిలో ఉన్న కార్యకర్తలు, నాయకులు తమను తీవ్రంగా వేధించారని ఆరోపించారు. అటువంటి నాయకులను తిరిగి తమకు తెలియకుండానే పార్టీ అధిష్టానం పార్టీలో చేర్చుకోవడం తమను తిరిగి వేధించడానికేనా అంటూ వారు ప్రశ్నించారు. అతి చిన్న గ్రామంలో ఏ విషయం తమతో సంప్రదించకుండా, కనీసం తమకు తెలియజేయకుండా తమను ఎంతో కాలం వేధించిన వారిని పార్టీలో చేర్చుకోవడం పట్ల తమ తీవ్రమైన ఆవేదన వ్యక్తం చేస్తున్నామని వారు తెలిపారు. ఈమేరకు దీక్ష చేపడుతున్నట్లు ఆ పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. ఆముదాల సతీష్, రాట్నాల వెంకటేశ్వరరావు తదితర గ్రామ కార్యకర్తలతో మండల నాయకులు కోపల్ల హనుమ, గవర అనిల్ సంఘీభావం తెలిపారు.

జవహర్‌ని కలిసిన ఎంఆర్‌పిఎస్ నేతలు

పాలకొల్లు రూరల్: మాదిగలను గుర్తించి మాజీ మంత్రి కెఎస్.జవహర్‌ని ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర కమిషన్ ఛైర్మన్ పదవి ఇచ్చి గౌరవించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పోరాట సంఘాలు చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఎస్‌పి జిల్లా గౌరవ అధ్యక్షులు కనపాల పెద్దిరాజు మాదిగ జవహర్‌ను కొవ్వూరులో ఆదివారం ఆయన నివాసంలో కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితోపాటు ఎంఎస్‌పి నాయకులు కాప ఇస్రాయిల్, దిగమర్తి వెంకటేశ్వరరావు, చదలవాడ రాజ్ కుమార్, ఆకుమర్తి ఏస్సయ్య, లంక రాజేష్, ఉండ్రాజవరపు ఆనంద్ కుమార్ పాల్గొన్నారు.

బండి ముత్యాలమ్మ సన్నిధిలో యాత్రికులు

మొగల్తూరు : మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో ఆదివారం కళకళలాడింది. జాతర మహోత్సవాల్లో భాగంగా యాత్రికులు ఆలయానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. మాజీ ఎంఎల్‌ఎ బందారు మాధవ నాయుడు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం సభ్యులు ఆలపించిన గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోక అరుణ్ కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాద వితరణ తదితర సేవ కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ముత్యాలమ్మ జాతర

మొగల్తూరు : పేరుపాలెం నార్త్ పంచాయతీ పరిధి కలికల వారి మెరకలో వేంచేసియున్న ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఏడుగురు వ్యక్తుల అరెస్ట్ : రూ.4,310 నగదు

నరసాపురం : మండలంలోని సరిపల్లి పద్మశ్రీ కాలనీ ప్రాంతంలో ఆదివారం పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసినట్లు రూరల్ ఎస్‌ఐ బి.వెంకట సురేష్ తెలిపారు. ఈ దాడిలో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి వద్ద నుండి రూ.4310 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుని అరెస్ట్

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆదివారం బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ప్రోహిబిషన్ ఎక్సైజ్ సిఐ ఇ.స్వర్గంభూపాల్ తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.దొరబాబు, మురళీమోహన్ రావు, సిబ్బందితో కలిసి మండలంలోని మాధవరం గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి ఆరు మ్యాక్‌డోవెల్స్ మద్యం సీసాలు స్వాధీనపరుచుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నరసాపురం : రుస్తుంబాద నేషనల్ హైవే 216 వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వేములదీవి పంచాయతీకి చెందిన సర్దుకోడప గ్రామానికి చెందిన సత్యనారాయణ గాయపడ్డారు. అటుగా వెళ్తున్న ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని దగ్గరుండి హాస్పిటల్‌కు తరలించి అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. ఆయన మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఇక్కడే ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలని వృత్తంగా ఎన్‌హెచ్ 216లోని ప్రమాదకరమైన ప్రాంతాల్లో భారీ గేట్లు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను, పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ప్రజల ప్రాణాలకు ముఖ్యమని, ట్రాఫిక్ నియంత్రణ, హెచ్చరిక బోర్డులు, రక్షణ చర్యల అమలులో ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిందిగా కూడా సూచించారు.

పోలీస్‌నని బెదిరించి..

మొగల్తూరు : పోలీసుల పేరు చెప్పి నగదు దండుకుని ఖాతాకు బదిలీ చేయించుకున్న సంఘటన ఆదివారం మొగల్తూరులో వెలుగుచూసింది. దీనికి సంబంధించి బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరులోని కూరగాయల వ్యాపారి ముష్క పురుషోత్తం(పిచ్చియ్య) మొగల్తూరు ఎస్ఐని మాట్లాడుతున్నానని ఒక వ్యక్తి ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కి రావాలని సూచించగా ఆయన అక్కడికి వెళ్లారు. అక్కడికి వెళ్లి కలిసివ్వకపోవడంతో తిరిగి ఫోన్ చేయగా మీటింగ్‌లో ఉన్నాను అత్యవసరమని రూ.85 వేలు ఫోన్ పే ద్వారా బదిలీ చేయమన్నారు. తాను నగదును బదిలీ చేశానని తెలిపారు. తిరిగి ఫోన్ చేయగా అవతల వ్యక్తి ఫోను స్విచ్చాఫ్ చేయడంతో తాను మోసపోయానని గ్రహించి మొగల్తూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశానని బాధితుడు పురుషోత్తం తెలిపారు.

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఇంగ్లీష్ బోధనకే స్కూల్ స్థాపన

శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ వంశీకృష్ణ




శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్



ప్రజాశక్తి – ఆకివీడు

గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇంగ్లీష్ మీడియం చదువులు అందుబాటులో లేని రోజుల్లో 1987వ సంవత్సరంలో ఇక్కడ తాము ఇంగ్లీష్ అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో శారద ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను ప్రారంభించామని పాఠశాల డైరెక్టర్ వంశీకృష్ణ తెలిపారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ 1987లో 15 మంది విద్యార్థులు, 10 మంది సిబ్బందితో తమ పాఠశాలను తన మామయ్య కొప్పాక చలపతిరావు ప్రారంభించారన్నారు. 1990లో మొట్టమొదటి పదో తరగతి బ్యాచ్ నలుగురు విద్యార్థులతో మొదటి బ్యాచ్ పరీక్షలకు హాజరైందని, ఈ సంవత్సరం 60 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలిపారు. హాజరైన నూరు శాతం విద్యార్థులు ఉత్తమ మార్కులతో పాసయ్యారని చెప్పారు. సుమారు ఒకటిన్నర దశాబ్దంగా తమ పాఠశాల నుంచి పదవ తరగతి ఫలితాలు నూరుశాతం సాధిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు పాఠశాల స్థాపించిన నాటినుండి నేటి వరకు 1760 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలకు హాజరుకాగా 97 శాతం విద్యార్థులు ఫలితాన్ని సాధించారన్నారు. చదువుతోపాటు విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించాలని తమ సంస్థ కృషిచేస్తుందన్నారు. ఆదిశగా గత 30 సంవత్సరాలుగా తమ పాఠశాలలో విద్యార్థులు చదివిన చదువుకు రూపందిద్దే కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రతి సబ్జెక్టులను చదివిన పాఠానికి రూపం ఇస్తూ ఒక బొమ్మను తయారు చేయాలి. ఆ రకమైన సాంకేతిక పరిణితి విద్యార్థులలో వృద్ధి చెందే విధంగా కార్యక్రమం చేపట్టామన్నారు. ఆ విధానంలో ప్రతి సంవత్సరం సంవత్సర చివరి రోజుల్లో విద్యార్థి చదివిన మొత్తానికి సైన్స్, లెక్కలు, సాంఘిక శాస్త్రంతో పాటు, భాష శాస్త్రాలను కూడా కలిపి బొమ్మలుగా తయారుచేసి భారీ స్థాయిలో ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఈ రకమైన విధానం విద్యార్థులకు మంచి స్ఫూర్తినిస్తుందని, ఎంతోమంది అధికారులు ఎన్నోసార్లు తమకు ప్రశంసలు ఇచ్చారన్నారు. ఆపరంపరలో భాగంగానే ఈ ఎగ్జిబిషన్ ప్రదర్శనలో 2014లో రాష్ట్రంలో ద్వితీయ స్థానం పొందామన్నారు. అక్రమంలోనే జిల్లా సైన్స్ కాంగ్రెస్‌కు తమ పాఠశాల నుంచి ఆనాడు నలుగురు విద్యార్థులు, ఇన్‌స్పైర్ అవార్డులకు నలుగురు ఎంపికైనట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం తమ విద్యార్థులు సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక అవుతూ రాష్ట్రస్థాయి బహుమతులు గెలుస్తున్నామన్నారు. మనిషి మేధస్సుకు ప్రమాణంగా చూసే నాట్(నేషనల్ ఆప్టిట్యూడ్) పరీక్షలలో జాతీయ స్థాయిలో తమ విద్యార్థులు 18 మందికి అత్యుత్తమ ర్యాంకులు వచ్చాయని చెప్పారు. కరోనా బ్యాచ్ మినహా నేటి వరకు తమ పాఠశాల నుండి ఎపిఆర్‌జెసికి ప్రతి సంవత్సరం విద్యార్థులు ఎంపిక అవుతున్నారన్నారు. తమ పాఠశాలలో 10వ తరగతి పాసైన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభా పురస్కారాలు సైతం అందుకున్నారన్నారు. తదుపరి కాలంలో ఇంటర్ పాసైన విద్యార్థులు ఐఐటిలో ర్యాంకులు సాధించారని తెలిపారు. 2024–25 సంవత్సరంలో తమ పాఠశాల విద్యార్థులు జనరల్ నాలెడ్జ్ పోటీలలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించారన్నారు. క్రీడల్లో సైతం పాఠశాల ముందు నిలిచిందని, గత సంవత్సరం జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు, జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైన తమ విద్యార్థులు ఆడారని చెప్పారు. చిన్న మిషన్ ఇంటర్నేషనల్ వారు నిర్వహించే భగవద్గీత పోటీల్లో తమ విద్యార్థులు జిల్లా స్థాయి బహుమతులు గెలుపొందారని చెప్పారు. ప్రస్తుతం తమ హై స్కూల్ 1200 మంది విద్యార్థులతో, 65 మంది సిబ్బందితో విద్యార్థులకు అందుబాటులో ఉండే ఫీజులతో, ఉత్తమ విద్య ప్రమాణాలతో నిర్వహిస్తున్నామని వంశీకృష్ణ తెలిపారు.



2002–03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

అలనాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ..

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి – పాలకొల్లు

పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో పాలకొల్లు ఎంఎంకె ఎన్‌ఎంహెచ్ స్కూల్లో 2002–2003 సం.లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆటపాటలతో ఉల్లాసంగా, ఉత్సాహంగా పాత తీపి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను సత్కరించారు. 2028వ సంవత్సరంలో స్కూల్ ప్రాంగణంలో 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ వేడుక ఘనంగా జరుపుకోవాలని నిర్ణయించారు. ఈ వేడుకలో పాలకొల్లు టిప్పర్ సంఘం అధ్యక్షులు చెరుకూరి అంజిబాబు, జిఎస్‌ఎన్ ఆర్ట్ అధినేత జిఎస్‌ఎన్.రవి, ఇమిడి కుమార్, హరీష్, ఎం.రాజా, కె.సత్య, బి.బాలాజీ, ప్రసాద్, నవీన్ నరేన్, ధన దుర్గ, గీత, ధనలక్ష్మి, శైలజ పాల్గొన్నారు.

ఆరుగురు వృద్ధులకు వైద్య సేవలు

ప్రజాశక్తి – తణుకు

ఇంటికే పరిమితమైన అనారోగ్య వృద్ధులకు సంచార శకటం ద్వారా ఆదివారం సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ వారు సంయుక్తంగా ఇంటింటికి ఉచిత వైద్యసేవలు అందజేశారు. ప్రముఖ నేత్ర వైద్యులు డా.హుస్సేన్ అహ్మద్, డా.సుంకవల్లి నీలుమహేంద్రలు తణుకు, సజ్జాపురం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి ఆరుగురు వృద్ధులకు ఉచిత వైద్యసేవలు అందజేశారు. సంఘ సభ్యులు కె.రామమోహనరావు ఆర్థిక సహకారంతో ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి, గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి – భీమవరం టౌన్

చిన్నారుల భద్రత విషయంలో వారి తల్లిదండ్రులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్ అన్నారు. ఆదివారం అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా తప్పిపోయిన, అపహరణకు గురైన పిల్లల పట్ల ప్రజలకు అవగాహన కల్పించుటకు భీమవరం లంకపేటలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు న్యూటన్ ముఖ్య అతిథిగా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కె.సుబ్బరాజు, ఏరియా ప్రముఖులు కె.కనకారావు, డ్వాక్రా నాయకురాలు యడ్ల పుష్ప, పారా లీగల్ వాలంటీర్ కె.చంద్రరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం న్యూటన్ సమర్పణలో మహిళలకు కాటన్ చీరలు పంచిపెట్టారు.

రోహిణి కార్తె తొలిరోజు తగ్గిన ఎండ తీవ్రత

పాలకొల్లు : రోహిణి కార్తె ఆదివారం నుంచి ప్రారంభమైంది. రోహిణి కార్తె తొలిరోజు ఎండ ప్రభావం అంతంత మాత్రంగానే ఉంది. శనివారం ఉదయం జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడటంతో వాతావరణం చల్లబడింది. రోహిణి కార్తెలో రోళ్ళు పగిలి పోయేలా ఎండ కాస్తుంది. అయితే గత వారం రోజులుగా వాతావరణం మార్పు వల్ల అడపాదడపా వర్షాలు పడటంతో వాతావరణం చల్లబడింది.

వ్యవస్థల అభివృద్ధికి కృషి చేయాలి

జెసిఐ నేషనల్ ఛైర్మన్ పిపిపి.వేణుగోపాల్

ప్రజాశక్తి – భీమవరం టౌన్

భవిష్యత్ తరానికి దేశంలోనే అవకాశాలు సృష్టించేలా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్(జెసిఐ) నేషనల్ ఛైర్మన్ పిపిపి.వేణుగోపాల్ అన్నారు. ఆదివారం భీమవరం త్యాగరాజ భవనంలో ఆదివారం జెసిఐ జెకామ్‌ఎల్ భీమవరం 1.0ను ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఎవరికైనా ఒక రోజులో 50 శాతం వరకూ రిస్కు ఉంటుందని, ప్రతి పనిలోనూ ఇది సహజమేనని, సమాజానికి మంచి చేయడమే వ్యాపారమని, ఇలా చేసినప్పుడు డబ్బు అదే వస్తుందన్నారు. వ్యాపారస్తులు ఈ విషయాన్ని గుర్తించాలని, మనసులో అనుకున్నది అమలు చేయడం నేర్చుకోవాలన్నారు. జోన్ ప్రెసిడెంట్ టి.భరత్ కుమార్ మాట్లాడుతూ ఇష్టమైన పనిని ఎంచుకుని ఎంత కష్టమైనా సరే లక్ష్యాన్ని సాధించేందుకు కృషిచేయాలని, విజయం సాధించాలంటే ఆలోచనే ముఖ్యమని అన్నారు. జెకామ్ ఎల్ భీమవరం ఛైర్మన్ పి.రామ్మోహన్ రావు, ఇంటర్నేషనల్ కమిషన్ మెంబర్ పేరిచర్ల కృష్ణంరాజు, భీమవరం జెసిఐ ప్రెసిడెంట్ దాట్ల అశ్విని చైతన్య మాట్లాడుతూ ఎక్కడ తగ్గాలో కూడా నేర్చుకోవాలని, అందరూ వెళ్లిన దారిలో వెళ్తే కొత్త మార్గాన్ని ఏర్పాటు చేయలేమనే సూత్రాన్ని గమనించాలన్నారు. ఇతరులకన్నా భిన్నంగా ఆలోచించడం నేర్చుకోవాలన్నారు. ఇండియా వారీగా సుమారు 90 వేల మంది జెసిఐ మెంబెర్స్‌గా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో సంతోష్ కశ్యప్, జిఎస్‌ఆర్ అరవింద్, కృష్ణచైతన్య, రామ్ సూర్య, పవన్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఛైర్మన్ వేణగోపాల్

పుస్తక పఠనంతో విజ్ఞానం

కొనసాగిన వేసవి విజ్ఞాన తరగతులు

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

గ్రంథాలయాల్లో లభించే పుస్తకాలను చదవటం వల్ల మంచి విజ్ఞానవంతులు అవుతారని తాడేపల్లిగూడెం ప్రథమ శ్రేణి గ్రంథాలయ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. జూన్ నెల ఆరో తేదీ వరకు జరిగే ఈ వ్యాసం శిక్షణా తరగతులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని తెలియజేశారు. పట్టణంలో ఉన్న తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. రిసోర్స్‌పర్సన్ ప్రత్తి వీరాస్వామి, జనార్ధన్ రావు, కొప్పెల్లి శ్రీనివాసరావు విద్యార్థులకు పొడుపు కథలు, సైన్స్ పాఠాలు, మ్యాజిక్ నేర్పించారు. ఆటపాటలతో విద్యార్థులను అలరించారు. గరికపాటి బాపయ్య శర్మ విద్యార్థులకు రుతుపవనాల గురించి బోధించారు.

నరసాపురం: ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల నిర్వహణలో భాగంగా హాజరైన విద్యార్థులకు ఆదివారం ప్రముఖ వ్యాఖ్యాత రెడ్డప్ప ధవేజీ కథలు, పద్యాలు, వ్యాఖ్యానం, తాళపత్రాల గురించి సవివరంగా తెలియజేశారు. చిన్న చిన్న రాళ్లు చిల్లర దేవుళ్లు.. సర్పంబులున్ తేళ్లు సజ్జ జొన్న కూళ్లు.. పల్నాటి సీమ పల్లెటూర్లు.. పల్నాటి సీమ గురించి శ్రీనాథుని చాటువును.. చాలా చక్కగా పిల్లలకు వర్ణించి వివరించారు. శాస్త్రవేత్త సుబ్బారావు ఖగోళంలో మన భూమి చిరునామా–భూమిలో మన చిరునామా అనే అంశంపై విశ్వం ప్రస్తుత చిత్రాన్ని వివరించారు. అంతరిక్ష పరిశోధనల గురించి తెలియజేశారు. ఈ వేసవి శిక్షణ తరగతులు జూన్ 6వ తేదీ వరకు జరుగుతాయని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలియజేశారు.

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం 27వ రోజు కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. గ్రంథాలయంలో మాస్టర్ శివకుమార్ పిల్లల చేత వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. మోరల్ స్టోరీస్, కథలు చెప్పడంతో పాటు, ఈరోజు పిల్లల చేత యోగా చేయించడం, చెస్ నేర్పడం చేశారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులు సిహెచ్.రేవంత్, పి.రాకేష్, కె.శేఖర్, డి.ప్రకాష్ రెడ్డి, పి. భవిష్య, ఎన్.ఆదిత్య, వి.అనురామ్, జి.సూర్య, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

అకాల వర్షాలతో రైతాంగం విలవిల

ప్రభుత్వం ఆదుకోవాలి : ఎపి కౌలురైతుల సంఘం

నరసాపురం : టార్గెట్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వం వెంటనే గోనెసంచులు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు సమస్యలపై ఆదివారం ఆయన నరసాపురం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో రైతాంగం ధాన్యం మాసూలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆరుగాలం కష్టం మాసూలు చేసి ధాన్యం అమ్మేందుకు రైతులు రైతుసేవా కేంద్రాలకు వెళ్తే అక్కడ అధికారులు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయడంలేదు. ఇక్కడ సంచులు ఇవ్వం మీరే మిల్లర్ల వద్దకు వెళ్లి సంచులు తెచ్చుకొని అమ్ముకోండని చెప్పడం దారుణమన్నారు. తక్షణమే ప్రభుత్వ గోనెసంచులిచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తూ జెసి, ఆర్‌డిఒ, జిల్లా వ్యవసాయ అధికారులకు సంఘంగా లేఖ రాసామని తెలిపారు.

సరుకు ఫుల్.. కొనుగోలుదారులు నిల్!

ఆవకాయ మామిడి అమ్మకందారుల ఆందోళన



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దుకాణాలు

ప్రజాశక్తి – పెనుమంట్ర

ఈ ఏడాది ఆవకాయ, మాగాయకు చెందిన మామిడికాయల దిగుబడి ఎక్కువగా ఉందని ఎంతగానో ఆనందపడ్డ హోల్‌సేల్ అమ్మకందారులు ప్రస్తుతం కాయలు కొనేందుకు వచ్చే వినియోగదారులు తగ్గడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సీజన్‌లో తోటల్లో కాపుతో పాటు, పొలాల పుంత గట్లలో, ఇళ్లల్లోని పెరటి తోటల్లో సైతం మామిడికాయలు విరగ కాసాయనే చెప్పాలి. దీంతో ఎక్కడికక్కడే పొలం గట్లమీద, ఇళ్ల దగ్గర పచ్చడి మామిడి కాయలు కొనేవాళ్లు ఎక్కువయ్యారు. కొందరైతే తెలిసిన వారు ఇచ్చిన ఇంటితోట మామిడి కాయలను పుచ్చుకొని సంబరాలు చేసుకుంటున్నారు. ముఖ్యంగా మార్కెట్లో అమ్మకందారులు ఆవకాయ పెట్టడానికి ఎక్కువ మంది ఉపయోగించే, ఎక్కువ కాలం పాటు పచ్చడి నిల్వ ఉండే ఐజార్ రకం మామిడి కాయలు వీటి సైజు సహజంగా చిన్నవిగా ఉన్నా, ఒక్కొక్కటి పాతిక నుంచి రూ.30 పలుకుతోంది. వీటికి ఉన్న డిమాండ్ అటువంటిది. ఈ కాయలతో పెట్టిన ఆవకాయ ఏడాది అయ్యాక కూడా ముక్క, దానిమీద టెంక మెత్త బడక, గట్టిగా ఉండడమే దీని ప్రత్యేకత అంటారు వినియోగదారులు. ఇంకా ఆవకాయ రకాలలో కొత్తపల్లి కొబ్బరి, సువర్ణ రేఖ, వీటితో పాటుగా మార్కెట్‌లో విరివిగా దొరికే కొన్ని దేశవాళీ రకాల కాయలు కాయ ఒక్కటి రూ.20 నుంచి 25 ధర చెబుతున్నారు. ఇక మాగాయి పచ్చడి కోసం వినియోగించు చిన్నరసాలు, పెద్ద రసాలు, కలెక్టర్ రకాల మామిడి కాయలు సైజును బట్టి కాయ ఒక్కటి రూ.20 నుంచి 30 ధరకు అమ్ముతున్నారు. ఆవకాయో, మాగాయో, తొక్కు పచ్చడో లేనిదే భోజనం కానివ్వని అలవాటు ఉన్న అన్ని తరగతుల వారు ఈ సీజన్ లో పచ్చడి పెట్టడానికి రేట్లు ఎలా ఉన్నా సిద్ధపడుతున్నారు. ఎండలు మండుతున్నా కాయలు కొట్టాల్సిందే.



మామిడికాయ ముక్కలు కొడుతున్న కూలీలు

ఆవకాయ సీజన్లో ఇంటిల్లి పాదికి ఇదే ఉపాధి

వాళ్లంతా ఆడా, మగా తేడా లేకుండా ఏదో కూలీ పని చేసుకునే రోజు వారీ కార్మికులు. ఆవకాయ సీజన్ రాగానే మండలంలోని మార్టేరు పెద్ద వీధి సెంటర్‌లో ఆవకాయ పచ్చడి పెట్టడానికి వీలుగా ఉండే ముక్కల్ని కొట్టే పనిలో మండే ఎండలను సైతం లెక్క చేయకుండా ఇంటిల్లి పాదీ ఈ పనిలోకి దిగిపోతారు. కాయ సైజును బట్టి నాలుగు, ఆరు, ఎనిమిది ముక్కల్ని కొట్టడానికి కాయకు మూడు నుంచి నాలుగు రూపాయలు కూలి తీసుకుంటారు. ఒక్కోసారి కాయ కొట్టే పనిచేసే కార్మికులలో కొందరికి చేతిలో గాటుపడడం, వేళ్ల తెగడం జరుగుతుందని, అయినా ఆవకాయ సీజన్లో నాలుగు డబ్బులు సంపాదన కనిపించాలంటే ఈ పని తప్పదని కార్మికులు అంటున్నారు.

రేటు తక్కువ.. ఘాటు ఎక్కువ..

మార్కెట్‌లో పచ్చడి ఎండు మిర్చి కారుచౌక

ప్రతీ ఏటా ఆవకాయ పచ్చళ్ల సీజన్లో అధిక ధరలతో వినియోగదారులకు భారంగా మారే పచ్చళ్లకు వాడే ఎండుమిర్చి ధర ప్రస్తుతం కిందికి దిగివచ్చింది. పచ్చడికి ఎండు మిర్చి ధర తక్కువైనా, కారం ఘాటు ఎక్కువగా ఉండడం ఈ ఏడాది విశేషం. మార్కెట్‌లో ఆవకాయ కోసం ఉపయోగించే పచ్చడి రకం ఎండు మిరప కాయలు ఒక రకం కిలో రూ.300, తక్కువ రకం రూ.280 మాత్రమే పలుకుతున్నాయి. గతంలో పండించిన పంట ఈ సీజన్ కోసం స్టోర్ చేయడం, ప్రస్తుత పంట కొన్ని ప్రాంతాల్లో ఎక్కువ దిగుబడి ఉండడం వల్ల ధర తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. ఇక పచ్చడిలో వాడే నూ పప్పు నూనె కిలో రూ.400, వెల్లుల్లి కిలో రూ.190, చిన్న ఆవాలు కిలో రూ.190, పెద్ద ఆవాలు కిలో రూ.120, మెంతులు కిలో రూ.120 పలుకుతున్నాయి. దీంతో వినియోగదారులు మామిడి కాయల ధరలు ఎక్కువగా ఉన్న కారం మిర్చి, తదితర దినుసులు అందుబాటులోకి రావడం వల్ల పచ్చడి పెట్టే వినియోగదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ధర తగ్గిన ఎండుమిర్చి